క్లుప్తంగా

7న ప్రసన్నాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



ఫిరంగిపురం: ఫిరంగిపురం మండలం వేమవరం గ్రామంలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ 21 వార్షికోత్సవం ఈనెల 7న నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పొట్టి వీరేశం గుప్త మంగళవారం తెలిపారు. 6న ఉదయం స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి నూతన వస్త్రాలతో అలంకరిస్తారని చెప్పారు. గ్రామానికి చెందిన సీతారామ భక్తసమాజం వారితో హనుమాన్ చాలీసా పారాయణం ఉంటుందన్నారు. 7న ఉదయం మండపారాధన, విశ్వక్షేన పూజ, శాంతి కల్యాణం వేదపండితులు నారాయణం గోవర్ధన రఘురామ్‌తో నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తామని.. సాయంత్రం ఉత్సవమూర్తులతో గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాలను కె.పేరారెడ్డి పర్యవేక్షిస్తారన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



తాడికొండ: వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా దానం వినోద్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబును మంగళవారం వినోద్ మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించినందుకు వజ్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తానని వినోద్ అన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

తాడికొండ: మండల కేంద్రంలోని బండ్ల కోటేశ్వరరావు మిత్రమండలి, కాటూరు మెడికల్ కళాశాల అండ్ వైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 81మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశామని నిర్వాహకులు పేర్కొన్నారు. వారిలో 13 మందిని వైద్యశాలకు పరీక్షల నిమిత్తం సిఫారస్ చేసామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీ బండ్ల కోటేశ్వరరావు, చింతల భాస్కరరావు, గంగిరెడ్డి, షేక్ రఫీ, వి.సుధాకర్, కె.సాంబయ్య, మేడ నరసింహారావు, చిలక బుజ్జి, ఎస్.పెద్దబ్బాయి, డి.నాగేశ్వరరావు, కె.అంజయ్య, టి.అప్పారావు, పి.తిరుపతిరావు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రయదారుడు

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణంలోని పార్కు రోడ్డులో గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని మంగళవారం లీగల్ టీమ్ అదుపులోకి తీసుకున్నారు. సేకరించిన వివరాల మేరకు.. నవులూరుకు చెందిన యువకుడు మంగళగిరిలో గంజాయి విక్రయిస్తున్నట్లు లీగల్ టీమ్‌కు సమాచారం అందింది. ఈ సమాచారంతో మంగళగిరి పార్కు రోడ్డులో పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలిసి లీగల్ టీమ్ ఎస్‌ఐ నేతృత్వంలో దాడి చేశారు. గంజాయి విక్రయిస్తున్న యువకుడుతో పాటు కొనుగోలు చేస్తున్న మరో ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారిని రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గంజాయి విక్రయిస్తున్న యువకుడు వద్ద భారీ మొత్తంలో గంజాయి నిల్వ ఉందనే సమాచారంతో పూర్తి స్థాయిలో విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నూరు శాతం చెత్త సేకరణ జరపండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: పట్టణంలో నూరు శాతం చెత్త సేకరణ జరిగే విధంగా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. చెంచుపేటలో మంగళవారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. రోడ్ల వెంట ఉన్న వ్యర్థాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు బుట్టల విధానాన్ని తెనాలిలో అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

కౌమార దశలో మానసిక వికాసం

ప్రత్తిపాడు: కౌమార దశలో కిశోర బాలికల్లో మానసిక వికాసం, సాంఘిక పరిపక్వత వేగంగా వృద్ధి చెందుతుందని ఐసీడీఎస్ ప్రత్తిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్.భారతి అన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని యాదవపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కౌమార బాలికల నాయకత్వం, సాధికారతపై కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నాసరమ్మ, నగరాజకుమారి, వెంకాయమ్మ, ఎంఎస్‌కే ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'వెన్నుపోటు దినం'

- కూటమి ఏడాది వైఫల్యాలనను నిలదీసేలా కార్యక్రమాలు
- పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ పిలుపు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడేపల్లి రూరల్: నియోజకవర్గం వ్యాప్తంగా బుధవారం జరగనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తాడేపల్లి వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులు కోరారు. మంగళవారం తాడేపల్లిలో వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజల్ని మోసం చేస్తోందని.. బాబు ప్రభుత్వాన్ని నిలదీసేలా కార్యక్రమాలకు హాజరు కావాలని కోరారు. ఈ తీరును నిరసిస్తూ నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బూదాల శ్రీను, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్, తాడేపల్లి పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు చిలుకోటి శ్రీనివాస మధు, బోడా ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం: తాడికొండ నియోజకవర్గంలో బుధవారం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు వెన్నుపోటు దినం నిర్వహించనున్నారు. నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు తరలి రావాలని పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి కోరారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమాన్ని ప్రజలు జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వంట బిల్లులను వెంటనే చెల్లించాలి



మధ్యాహ్న భోజన కార్మికులతో మాట్లాడుతున్న వేముల దుర్గారావు

తాడేపల్లి రూరల్: మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 4 నెలల జీతాలు, వంట బిల్లులు వెంటనే చెల్లించాలని యూనియన్ గౌరవ అధ్యక్షులు వేముల దుర్గారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం తాడేపల్లిలోని సీఐటీయూ కార్యాలయం వద్ద మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం విస్తృత స్థాయి సమావేశాన్ని కోట స్వర్ణలత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతం రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులపై రాజకీయ వేదింపులు ఆపాలని అన్నారు. ప్రతి నెలా బిల్లులు, జీతాలు చెల్లించాలని, ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని కోరుతున్నామన్నారు. జూలై 9వ తేదీన దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెలో మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మిక సంఘాన్ని ఎన్నుకున్నారు. తాడేపల్లి మండల గౌరవ అధ్యక్షులుగా వేముల దుర్గారావు, అధ్యక్షురాలుగా బొక్క అనూరాధ, కార్యదర్శిగా పంతగాని నాగలక్ష్మి, ఏడుగురు కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.

సచివాలయ అధికారులకు వినతిపత్రం అందజేత



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

తాడేపల్లి రూరల్: ప్రాతూరు గ్రామంలోని సచివాలయ అధికారులకు ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు స్థానిక రైతులు, కౌలు రైతులతో కలసి వినతిపత్రాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులతో పాటు కౌలు రైతులకు నగదు జమ చేస్తామని చెప్పిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా రైతులు, కౌలు రైతుల ఖాతాలో అన్నదాత సుఖీభవ పథకం కింద ఇస్తామన్న రూ. 20 వేలు జమ కాలేదని అన్నారు. ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ.. పెట్టుబడి సాయం కింద కౌలు రైతులకు రూ.20 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. మంగళగిరిలో వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ఈనెల 11న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని అన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు పల్లెకృష్ణ, రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకట రెడ్డి, బుర్రా రాజు, మరియదాసు, కౌలు రైతులు నామతోటి సాంబశివరావు, పి.సుఖేష్ బాబు, డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

8న ప్రపంచ ప్రార్థనా దినోత్సవం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న విశ్వాసులు

మంగళగిరి టౌన్: క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన ప్రపంచ ప్రార్థనా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఇమ్మానియేల్ చర్చి పాస్టర్ రవిప్రకాష్ తెలిపారు. మంగళగిరి నగర పరిధి పార్కు రోడ్డులోని ఇమ్మానియేలు చర్చిలో మంగళవారం క్యాపిల్ రీజియన్ పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ ప్రార్థనా దినోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. రవిప్రకాష్ మాట్లాడుతూ.. టిప్పర్ల బజారులోని షాదీఖానాలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రపంచ ప్రార్థనా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రపంచ శాంతి, యుద్ధాలు, ఉగ్రవాద నిర్మూలన వివిధ అంశాలపై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో దైవ సేవకులు పిల్లి దయారత్నసాగర్, బేతాళ సాల్మన్ రాజు, మాతంగి భాస్కరరావు, అబ్రహం, శేఖర్‌బాబు, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఫిరంగిపురం: మండల పరిధిలోని ఫిరంగిపురం, వేములూరిపాడు, అమీనాబాద్ గ్రామాలకు సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ దుర్గాప్రసాద్ మంగళవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

తాడికొండ: ప్రమాదవశాత్తు కాలువలో ఆటో పడి తీవ్ర గాయాలు కావడంతో వైద్యశాలలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళగిరి మండలం నిడమర్రు గ్రామానికి చెందిన ఎం.ప్రసాద్(19) తన ఆటోలో ఇంటి గృహోపకరణాలు తీసుకుని వచ్చేందుకు సోమవారం తాడికొండకు బయలుదేరాడు. ఈ క్రమంలో దారిలో కంతేరు గ్రామ సరిహద్దులోని వంతెన వద్ద ప్రమాదవశాత్తు ఆటో కాలువలో పడిపోయింది. దీంతో ప్రసాద్‌కు తీవ్రగాయాలు కాగా చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంగళగిరి ఎన్ఆర్ఐ, అక్కడి నుంచి మణిపాల్‌కు రిఫర్ చేశారు. కాగా ప్రసాద్ తండ్రి మణికుమార్ యువకుడిని మున్సిపల్ వైద్యశాల ఎమర్జెన్సీ వార్డులో చేర్పించారు. చికిత్స పొందుతూ ప్రసాద్ మంగళవారం మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వీరాభిమాని



తెనాలి: వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తెనాలి పర్యటనలో సూపర్‌స్టార్ మహేశ్‌బాబు అభిమాని సందడి చేశారు. మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి, హీరో మహేశ్‌బాబు ఫొటోలతో కూడిన ఫ్లెక్సీని పర్యటన ఆద్యంతమూ ప్రదర్శించాడు. రూరల్ మండలం నందివెలుగు వద్ద జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికిన దగ్గర్నుంచి ఆయన కాన్వాయ్‌ను అనుసరించిన అభిమాని, అయితానగర్‌లో బాధిత కుటుంబాలను మాజీ సీఎం పరామర్శించటం, మీడియాతో మాట్లాడుతున్నంత సేపు ప్రదర్శించిన ఆ ఫ్లెక్సీ అందరినీ ఆకర్షించింది.

5న జరిగే మహాసభల్లో అందరూ పాల్గొనండి

తెనాలిఅర్బన్: ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన విజయవాడ బందర్ రోడ్డులోని ఎస్ఎస్ఏపీ కన్వెన్షన్ హాల్‌లో జరిగే మహాసభల్లో అందరూ పాల్గొనాలని ఆ సంఘ తెనాలి అధ్యక్షుడు షేక్ జానీబాషా ఒక ప్రకటనలో కోరారు. మహాసభల్లో ఉద్యోగుల సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను సంఘ నాయకులు ప్రకటించనున్నట్లు చెప్పారు. ప్రకటనపై సంతకాలు చేసిన వారిలో కార్యదర్శి కె.ధర్మసాయి, ఉపాధ్యక్షుడు ఎన్.అజయ్‌కుమార్, కళ్యాణ్, భాస్కర్ ఉన్నారు.

మోసానికి యత్నించిన నిందితుడిపై కేసు

తాడేపల్లి రూరల్: నిరక్షరాస్యులు, వృద్ధులకు టార్గెట్ చేసి వారిని మాటల్లో పెట్టి ఏటీఎం కార్డులు మార్చేసి నగదు డ్రా చేసి దోచుకుంటున్నారు కొందరు నేరగాళ్లు. అదే తరహాలో మంగళవారం ఉండవల్లి గుంటూరు చానల్ పక్కన ఉన్న ఏటీఎంలో ఓ వృద్ధురాలు డబ్బులు డ్రా చేసేందుకు రాగా ఆమెను మాటల్లో పెట్టి ఆమె వద్దనున్న ఏటీఎం కార్డును దొంగిలించాడు ఓ కేటుగాడు. వేరే కార్డును ఆ వృద్ధురాలికి అందజేశాడు. విషయాన్ని గమనించిన సదరు వృద్ధురాలు ఇది నా కార్డు కాదంటూ చెప్పడంతో అక్కడి నుంచి కార్డుతో సహా పరారయ్యేందుకు సదరు యువకుడు ప్రయత్నించాడు. అక్కడే ఉన్న కొందరు యువకులు ఆ నిందితుడిని పట్టుకుని బంధించారు. తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్ఐ ప్రతాప్ సంఘటనా స్థలానికి వచ్చి నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఆ వ్యక్తి విజయవాడకు చెందిన సురేష్‌గా గుర్తించారు. గతంలో అతనిపై పలు కేసులు ఉన్నాయని.. సురేష్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రతాప్ తెలిపారు.

దాడి చేశారంటూ ఫిర్యాదు

తాడికొండ: తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు మండల పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని కంతేరు గ్రామానికి చెందిన ఎ.రామకృష్ణ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. రామకృష్ణకు 13 ఏళ్ల కిందట లక్ష్మీ తిరుపతమ్మతో వివాహం జరిగింది. ఈ నేపథ్యంలో గతనెల 27న లక్ష్మీ తిరుపతమ్మ వారి ఇంటి వద్ద పురుగు మందు తాగారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. ఈ సంఘటన తరువాత లక్ష్మీ తిరుపతమ్మ తల్లిదండ్రులు, మరికొందరితో కలిసి ఆమె మృతదేహాన్ని కంతేరుకు తీసుకొచ్చి రామకృష్ణపై దాడిచేశారు. దీంతో రామకృష్ణకు తీవ్రగాయాలు అయ్యాయి. అడ్డు వచ్చేందుకు ప్రయత్నించిన అతడి తల్లి శివపార్వతిని కూడా గాయపరిచారు. దీంతో గ్రామస్తులు రామకృష్ణ, అతని తల్లిని గుంటూరు జీజీహెచ్‌కు చికిత్స కోసం తరలించారు. క్షతగాత్రుడైన రామకృష్ణ తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అన్నదాత సుఖీభవ రూ.20 వేల సాయం అందించాలి

మండల తహసీల్దార్‌కు సీఐటీయూ వినతి



వినతిపత్రం అందజేసిన సీఐటీయూ నాయకులు

తెనాలి: కౌలు రైతులు, రైతులకు అన్నదాత సుఖీభవ పథకం క్రింద రూ.20 వేల పెట్టుబడి సాయం అందించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం తెనాలి తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ మాట్లాడుతూ కౌలు రైతులందరికీ న్యాయం చేస్తామని ప్రభుత్వం చేసిన వాగ్దానం ఈ సంవత్సరం అమలు జరిగేటట్లు లేదన్నారు. నూటికి 70–80 శాతంగా ఉన్న కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు అందక రుణాలు, ప్రభుత్వ సాయం దక్కక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ గత సంవత్సరం తెనాలి మండలంలో ఇచ్చిన కౌలు కార్డులు కంటే రెట్టింపు కార్డులు ఇచ్చే విధంగా చూడగలమని హామీనిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ జొన్న, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు లేకపోవటంతో దళారీలు తక్కువ రేటుకి కొనుగోలు చేసి రైతుల్ని దోచుకుంటున్నారని తెలిపారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కొనుగోలు కేంద్రాలు తెరిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ తెనాలి డివిజన్ కార్యదర్శి షేక్ హుస్సేన్ వలి, మానవ హక్కుల సంఘం జిల్లా నాయకుడు నాగరాజు, కౌలు రైతుల నాయకులు వేజెండ్ల తబిత, తెనాలి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఏపీజీఈఏ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు జయప్రదం చేయండి

యూనిట్ అధ్యక్షులు అందెబాలచంద్రమౌళి



పోస్టరు ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొల్లిపర(తెనాలి): విజయవాడలోని బందరు రోడ్డులో గల ఎస్ఎస్ కన్వెన్షనులో ఈనెల 5న జరుగనున్న ఏజీపీఈఏ రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు హాజరు కావాలని హాజరుకావాలని దుగ్గిరాల యూనిట్ అధ్యక్షుడు అందెబాలచంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి టి.మనోహర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు గుంటూరు పూర్ణప్రసాద్ కోరారు. జిల్లా ఐక్యవేదిక చైర్మన్ సయ్యద్ చాంద్ భాషా మౌఖిక ఆదేశాలతో మంగళవారం కొల్లిపర తహసీల్దార్, ఎంపీడీవో, పంచాయతి, రిజిస్ట్రేషన్ కార్యాలయాల సిబ్బందిని కలిసి సమావేశానికి ఆహ్వానించారు. సమావేశాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యక్షుడు షేక్ మీరావలి, సంయుక్త కార్యదర్శి నూకవరపు శ్రీలక్ష్మీ కుమారి, కార్యవర్గసభ్యులు కొల్లిపర మండల సబ్ రిజిస్ట్రార్, ఎం.ఆదినారాయణరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, పరిపాలనాధికారి ప్రతాపరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వంశీకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఎం.శ్రీలక్ష్మీ కుమారి, వీఆర్వోలు భాస్కర్, సుష్మ, ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. సమావేశానికి హాజరయే ఉద్యోగస్తులందరికీ ప్రభుత్వం ప్రత్యేక సెలవు దినం ప్రకటించినందున తప్పక హాజరు కావాలని కోరారు.

11న ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావుకు అవార్డు

తెనాలి: విద్య, వైద్యం, వైజ్ఞానిక, కళాసేవ అంశాలతో 2009వ సంవత్సరంలో రూరల్ మండల గ్రామం ఖాజీపేటలో స్థాపించిన సీహెచ్ సాంబయ్య స్మారక పరిషత్ ఏటా అందజేస్తున్న అవార్డు ప్రదానోత్సవ సభ ఈనెల 11న జరగనుంది. వివిధ రంగాల్లో నిష్ణాతులైన ప్రముఖులను గుర్తించి 'విద్యాప్రదాత సీహెచ్ సాంబయ్య స్మారక అవార్డు'ను ఏటా ప్రదానం చేస్తున్న విషయం తెలిసిందే. 2025 సంవత్సరానికి ఈ అవార్డును నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావుకు అందజేస్తారు. 11వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీకంచి కామ కోటి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని అన్నమయ్య కళావేదికలో జరుగుతుందని సంస్థ అధ్యక్షుడు చిటుమడుగుల భాస్కరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కార్యక్రమం అనంతరం నాట్య మయూరి లేఖ్యా భరణి బృందం విజయవాడ వారిచే నృత్యప్రదర్శన వుంటుందని వివరించారు.

నిరాటంకంగా అభివృద్ధి పనులు

చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: పట్టణంలో అభివృద్ధి పనులు నిరాటంకంగా కొనసాగుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. 13,14,22,24 వార్డుల్లో నూతనంగా నిర్మించనున్న పలు సీసీ రోడ్లకు మంగళవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు, కౌన్సిలర్ల కోరిక మేరకు పట్టణంలో అనేక సీసీ రోడ్లు, కాల్వలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఇన్‌చార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు మాట్లాడుతూ రూ.92.60 లక్షలతో 4 వార్డులలో సీసీ రోడ్డులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కుర్రా సుజాత, దాసరి వీరవసంతరావు, షేక్ దుబాయ్‌బాబు, పెదలంక లక్ష్మీలావణ్య, తాడిబోయిన రామయ్య, ఏఈ సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కుక్కల వాసు, పెదలంక వెంకటేశ్వరరావు, సీమోను పాల్గొన్నారు.

మలేరియా అంతం కావాలి

జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం



ప్రతిజ్ఞ చేస్తున్న సుబ్బరాయణం

తెనాలిఅర్బన్: మలేరియా వ్యాధి మనతోనే అంతం కావాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పేర్కొన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా సాలీపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా ఆడ దోమ కాటు వలన వ్యాప్తి చెందుతుందని తెలిపారు. ఇది ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ఇంటి పరిసరాల్లో దోమలు లేకుండా చూసుకోవాలన్నారు. నీటి నిల్వల వలన దోమల వ్యాప్తి పెరిగే అవకాశం ఉందన్నారు. నీటిలో దోమలు గ్రుడ్లు పెట్టి వాటి సంతతిని పెంచుకుంటాయని వివరించారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని సూచించారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ దివి కిషోర్‌కుమార్ మాట్లాడుతూ 2027 నాటికి మలేరియా సున్న కేసులు నమోదు అవడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. 2030 నాటికి మలేరియారహిత భారతదేశాన్ని నిర్మించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ వైద్యశాలలో మలేరియా నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన వారు వాటిని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి శ్రీకంత ఉమాకాంత్, సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ గుద్దంటి రవికుమార్, సూపర్‌వైజర్లు దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, తిరువీధుల రాంప్రసాద్, చింతల ప్రసన్న పుష్పలత పాల్గొన్నారు.

సైనికుడు, సేవకుడు పుస్తక కవర్ పేజీ ఆవిష్కరణ



కవర్ పేజీని ఆవిష్కరిస్తున్న గవర్నర్ దత్తాత్రేయ

తెనాలిఅర్బన్: మాజీ సైనికుడు సీబీఆర్ ప్రసాద్ జీవిత చరిత్రను తెలియజేసే సైనికుడు–సేవకుడు పుస్తక కవర్ పేజీని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సీబీఆర్ ప్రసాద్‌ను గవర్నర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ సంఘ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, తెనాలికి చెందిన అయినంపూడి రత్నప్రసాద్ మాట్లాడుతూ ఎయిర్‌ఫోర్స్‌లో తొమ్మిది సంవత్సరాలు సైనికుడిగా సీబీఆర్ ప్రసాద్ పనిచేశారని చెప్పారు. భారత రక్షణశాఖకు రూ.1.8 కోట్ల విరాళాన్ని రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్‌కు అందజేసినట్లు చెప్పారు. అలాగే రూ.30 కోట్లతో సైనిక్ స్కూల్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఇటీవల సంభవించిన వరదల్లో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు రూ.54 లక్షల చొప్పున అందజేసినట్లు వివరించారు. కరోనా సమయంలో అంబులెన్స్‌ల కోసం రూ.3 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సైనికుడు వాకా ఆదినారాయణ పాల్గొన్నారు.

యోగాంధ్రలో పాల్గొనండి

తెనాలిఅర్బన్: యోగాంధ్ర కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం జరుగుతున్న శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో మేనేజర్ విల్సన్ జయకర్, ఆర్‌వో రాంప్రసాద్ పాల్గొన్నారు.

గుంటూరు చానల్‌కు మరమ్మతులు చేపడతాం



శిథిలావస్థలో గుంటూరు చానల్

పెదకాకాని: గుంటూరు చానల్‌పై నిర్మించిన వంతెనకు మరమ్మతులు చేపడతామని ఇరిగేషన్ ఏఈ అవినాష్ తెలిపారు. పెదకాకాని గ్రామం నుంచి గోళ్లమూడి వెళ్లే రోడ్డులో గుంటూరు చానల్(కొత్తకాలువ)పై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. దీంతో పెదకాకాని గ్రామానికి చెందిన వసంతరావు, పలువురు రైతులు ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. అలానే ఈ వంతెన వద్ద నీటి నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన లాక్ సిస్టమ్ డోర్లు కూడా దెబ్బతిన్నాయని వారు తెలిపారు. శిథిలావస్థకు చేరిన వంతెనకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరడంతో మంగళవారం ఇరిగేషన్ ఏఈ వంతెన వద్దకు చేరుకుని పరిశీలించారు. త్వరలోనే పనులు చేపడతామని ఏఈ స్థానిక రైతులకు తెలిపారు.